94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21




# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

'రాజధాని వార్తలు' పత్రికలో ప్రకటన కొరకు సంప్రదించండి
వై.రాజశేఖర్
ఫోన్ : 98480 89624, 9440662699
మంగళగిరి, గుంటూరు, విజయవాడ

అమరావతి సంపుటి : 4 సంచిక : 38, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 24 - ఆదివారం 30 జూన్,2019
Amaravati Volume : 4 Issue : 38, Pages 4, Rate : 2.00 ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY Monday 24 - Sunday 30 June, 2019

వివరాలు2లో...

ట్రిపుల్ తలాఖ్ అంటే?

వివరాలు3లో...

సాగు.. సాగేనా..?

వివరాలు4లో...

ప్రతిష్ట కోల్పోతున్న పార్లమెంటు

వివరాలు4లో...

హ్యాపీ హోం

# కులాల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం



- పంచాయతీల రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రభుత్వానికి నివేదిక
- త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్
- జిల్లాలో పంచాయతీలు ఓటర్లు 23,41,946
- 980 పంచాయతీలు... 9,990 వార్డులు
- పురుష ఓటర్లు 11,56, 726.. మహిళలు 11,85,084

**రాజధాని వార్తలు,విజయవాడ :** పంచాయతీ ఎన్నికలకు జిల్లా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన కులాల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. రిజర్వేషన్ల ఖరారు కోసం ఈ జాబితాను ప్రభుత్వానికి పంపారు. త్వరలోనే ప్రభుత్వం రోస్టర్ ప్రకారం వార్డులు, పంచాయతీలకు రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. అనంతరం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. ప్రస్తుతం సిద్ధం చేసిన ఓటర్ల జాబితాలో ఇక ఎటువంటి మార్పులు, చేర్పులు చేసే అవకాశం లేదు. జిల్లాలో మొత్తం 980 పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో 9,990 వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం అధికారులు సిద్ధం చేసిన జాబితా ప్రకారం జిల్లాలో 23,41,946 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 11,56,726మంది, మహిళలు 11,85,084 మంది, ఇతరులు 136 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా పెనమలూరు మండలంలోని పది పంచాయతీల్లో(158 వార్డులు) 1, 56,139 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత రెండో స్థానంలో విజయవాడ రూరల్ మండలంలోని 14 పంచాయతీల్లో(196 వార్డులు) 1,26,959 మంది ఓటర్లు ఉన్నారు. అతి తక్కువగా పెదపారుపూడి మండలంలోని 19 పంచాయతీలు(170 వార్డులు) కలిపి 23,277 మంది ఓటర్లు ఉన్నారు.

**కులాలవారీగా ఓటర్ల వివరాలు...**


జిల్లాలోని అన్ని పంచాయతీల్లో కలిపి షెడ్యూలు తెగలు(ఎస్టీ) ఓటర్లు 75,395 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 36,782 మంది, మహిళలు 38,609 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. షెడ్యూల్ కులాలు(ఎస్సీ) ఓటర్లు 5,73,815 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 2,81,777 మంది, మహిళలు 2,92,012 మంది, ఇతరులు 26 మంది ఉన్నారు. బీసీ ఓటర్లు 9,79,822 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 4,79,822 మంది, మహిళలు 4,95,372 మంది, ఇతరులు 58 మంది ఉన్నారు. ఓసీ ఓటర్లు 7,12,914 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 3,53,775 మంది, మహిళలు 3,59,091 మంది, ఇతరులు 48 మంది ఉన్నారు. అన్ని కేటగిరీల్లోనూ పురుషుల కన్నా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

# ఏపీలో 47 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ..

### రాత్రికి రాత్రే ఉత్తర్వులు



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాత్రికి రాత్రి 47 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా మద్దాడ రవిచంద్రను నియమించగా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా ముకేశ్ కుమార్ మీనాను నియమించింది. ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్స్ ఎండీగా వాణీమోహన్, కార్మిక శాఖ కమిషనర్‌గా డి.వరప్రసాద్, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా భానుప్రకాశ్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్‌గా హెచ్.అరుణ్ కుమార్, ఏపీ టూరిజం అథారిటీ ఎండీగా ప్రవీణ్ కుమార్, విపత్తు నిర్వహణశాఖ స్పెషల్ కమిషనర్‌గా కె.కన్నబాబు, పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శిగా బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శిగా వై.మధుసూదన్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్మిక ఉపాధి కల్పన, శిక్షణ ముఖ్య కార్యదర్శిగా బి.ఉదయ లక్ష్మి, ఇంటర్ బోర్డు కమిషనర్‌గా కాంతిలాల్ దండేను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



**రాజధాని వార్తలు, అమరావతి :** వైసీపీ అగ్రనేత, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ట్రస్టు బోర్డు చైర్మన్ గా ఈ ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీటీడీ తొలి ప్రాధాన్యత సామాన్య భక్తులేనని స్పష్టం చేశారు. తిరుమలలో తాగునీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తామని అన్నారు. శ్రీవారి ఆభరణాల విషయంలో వచ్చిన ఆరోపణలన్నింటిపైనా విచారణ జరిపిస్తామని, నిజానిజాలు వెలికితీస్తామని చెప్పారు. అంతేకాకుండా, అర్చకుల సమస్యలపై పీఠాధిపతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, త్వరలోనే మఠాధిపతులు, పీఠాధిపతులతో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

# సెప్టెంబరు 1 నుంచి సన్నబియ్యం



- వలంటీర్లకు ఈ-పోస్ యంత్రాలు
- ప్యాకింగ్ యంత్రాల కొనుగోలు యోచన
- ఆరు లక్షల మె.టన్నుల ధాన్యం సేకరణకు నిర్ణయం
- ప్రజాపంపిణీ వ్యవస్థలో వినూత్నత మార్పులు

**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం వినూత్న మార్పులు తీసుకురానుంది. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 1 నుంచి స్వర్ణ మసూరి, 11-21 రకం సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించింది. ఈ రకం బియ్యాన్ని 1,5,10,20 కిలోల సంచుల్లో ప్యాక్ చేసి వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటికే చేర్చనుంది. ఇందుకోసం రెండు నెలల్లో ఆరు లక్షల మె.టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు నిర్ణయించారు. వివిధ జిల్లాల్లో ప్రజలు ఒక్కో రకం బియ్యాన్ని వాడుతున్నందున ఆయా

- మిగతా 2 లో

# తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాఘవేంద్ర చౌహాన్!

### న్యాయమూర్తి చేత ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ నియమితులయ్యారు. ఇప్పటివరకూ హైకోర్టు తాత్కాలిక సీజేగా వ్యవహరిస్తున్న జస్టిస్ రాఘవేంద్రను పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఈరోజు జస్టిస్ రాఘవేంద్ర చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆయన ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తెలంగాణ హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.బి.రాధాకృష్ణన్ కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై వెళ్లడంతో జస్టిస్ రాఘవేంద్ర బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ రాఘవేంద్ర ప్రమాణస్వీకార కార్యక్రమానికి తెలంగాణ సీఎం కేసీఆర్ తో పాటు ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు.






## రాజధాని వార్తలు కలం

### చెప్పేందుకేనా..నీతులు?

దేశంలోని అత్యున్నత పదవులు నిర్వహించేవారు దేశానికి మార్గదర్శకంగా ఉండాలి. అప్పుడే ఆ వ్యక్తుతోపాటు దేశ ప్రజలకు గౌరవాభిమానాలు దక్కుతాయి. పదవిలో ఉన్నందుకు నాలుగు మంచి మాటలు చెప్పి, ఆనక అక్రమమార్గాలు అనుసరిస్తే.. పదవిని భ్రష్టు పట్టించినట్లే అవుతుంది. ప్రస్తుతం కాలంలో దేశంలోని అత్యున్నత పదవులు నిర్వహించేవారిలో ఎవరైనా విలువలు పాటించేవారున్నారా అని భూతద్దంలో చూసినా ఒక్కరంటే ఒక్కరు కూడా కనిపించడం లేదు. ఇది చాలా దురదృష్టకర పరిణామం..

**తన వాక్చాతుర్యంతో మెప్పించే ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు కొద్దికాలం క్రితం ఆంధ్రప్రదేశ్‌లో మాట్లాడుతూ పార్టీమారితే అదేరోజు పదవి పోవాలి..** అప్పుడే ప్రజాస్వామ్యం మనగలుగుతుంది. చట్టాన్ని పున:సమీక్షించాలని, లేకుంటే రాజకీయాల్లో విలువలు పతనం అవుతున్నాయని గొంతుచించుకొని.. తెలుగుదేశం రాజ్యసభ సభ్యులైన సుజనాచౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్, గరికపాటి మోహనరంగారావు(తెలంగాణ టీడీపీ)లను తమ పార్టీకి చెందినవారిగా రాజ్యసభ సభ్యుల బోర్డులో మార్పుచేసి పెట్టుకోవడానికి ఆయన మనస్సాక్షి ఎలా ఒప్పుకుందో ఆయనకే తెలియాలి. ఈ విషయంలోనే కాదు.. తెలుగు రాష్ట్రాల విభజన సమయంలో కూడా తానేదో ఏపీకోసం పోరాడినట్లు పార్లమెంటులో పదేళు ప్రత్యేక ప్రతిపత్తి కావాలని పట్టుపట్టానని,లేకుంటే రాష్ట్రం ఎందుకూ కొరకాకుండా పోయేదని నానా యాగీ చేశారు. అప్పటికే పార్లమెంటులో సోనియాగాంధీ వికృత చర్యలు చూసి ఆవేదన చెందిన ఏపీ ప్రజలు మనకోసం వచ్చిన మరో మెస్సయ్యా అంటూ రోజుల తరబడి సన్మానాలు చేశారు. అవన్నీ చేయించుకున్న తర్వాత రాష్ట్రానికి హోదా ముగిసిన అధ్యాయం అని చావుకబురు చల్లగా చెప్పారు. దీంతో వామపక్షాలు మండిపడుతూ రాష్ట్రంలోకి అడుగుపెట్టనిచ్చేది లేదంటూ నిరసన ప్రదర్శనలు చేశారు. ఇదే సమయంలో స్వర్ణభారతి ట్రస్టు పేరుతో ఆయన సాగించిన భూదందాలను కూడా బయట పెట్టారు. ఇదే సమయంలో రాష్ట్రంలో అప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశానికి, బీజేపీకి మధ్య చెడిపోవడం, చంద్రబాబుకు,ఆయన ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారన్న మిషతో ప్రధాని మోడీ ఆయనను తప్పించి, ఉపరాష్ట్రపదవి కట్టబెట్టారని దేశం కోడై కూసింది. స్వర్ణభారతి ట్రస్టు కార్యకలాపాల కోసం తరచూ రాష్ట్రం వచ్చే వెంకయ్యనాయుడు తెలుగు రాష్ట్రాల్లో చంద్రబాబు నాయుడు, చంద్రశేఖరరావులు పోటీలుపడి చేయిస్తున్న రాజకీయ ఫిరాయింపులను ఘాటుగా విమర్శించారు.

అయితే ఇప్పుడు వెంకయ్య నిర్ణయం వివాదాస్పదంగా మారింది. మెజారిటీ ఎంపీలు లేదా ఎమ్మెల్యేలు నిర్ణయాలు తీసుకున్నా ఏ విలీనం కూడా చెల్లదని కోర్టు తీర్పులు చెబుతూ ఉన్నాయి. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ రాజ్యసభ విభాగం బీజేపీలోకి విలీనం కూడా చెల్లదు అని గత కోర్టు తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. విలీనం జరగడం అంటే అది ఎన్నికల సంఘం ద్వారా జరగాలి తప్ప.. చట్టసభల ద్వారా జరిగేది కాదని తేటతెల్లం అవుతోంది.అయితే ఇన్నాళ్లూ ఫిరాయింపుల మీద నీతులు చెప్పిన వెంకయ్య నాయుడు తాజా ఫిరాయింపులకు మాత్రం తనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ప్రజాస్వామ్య వాదులను తీవ్ర కలతకు లోనుచేస్తోంది. అందునా రాష్ట్రానికి చెందిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావ్ గతేడాది నవంబరు 28న తెలుగుదేశానికి చెందిన రాజ్యసభ సభ్యులు సుజనాచౌదరి, సీఎం రమేష్‌లు తీవ్రమైన ఆర్థిక నేరస్తులని మరీ ముఖ్యంగా చౌదరి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ. 5,700 కోట్ల బకాయిలను ఎగనామం పెట్టి దొంగ కంపెనీలకు తరలించారని, సీఎం రమేష్ బినామీల ద్వారా పన్నుల ఎగవేతకు పాల్పడ్డారని పార్లమెంటు ఎథిక్స్( నైతిక విలువల) కమిటీ చైర్మన్ నారాయణ్‌లాల్ పచారియాకు లేఖరాస్తూ.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.. మళ్లీ ఇదే బీజేపీ వారికి సచ్ఛీలురనే సర్టిఫికేట్ ఇస్తే ప్రజలు నమ్మేస్తారా ? ? సర్జికల్ స్ట్రయిక్స్ చేస్తేనో.. జైశ్రీరామ్ అంటేనో ..మోడీ 58 అంగుళాల ఛాతీ చూసో విదేశాల్లో భారత్‌కు ప్రతిష్ట పెరుగుతుందనుకోవడం భ్రమ.. దేశనాయకులు విలువలు పాటిస్తేనే ప్రతిష్ట పెరుగుతుందని ఆయా పార్టీలు గుర్తెరగాలి...

# ట్రిపుల్ తలాఖ్ అంటే?

## ఇస్లాం ధర్మశాస్త్రం ఏం చెబుతోంది?




రాజ్యాంగంలో 44వ అధికరణలో ఆదేశిక సూత్రాలు చాలా ఉన్నాయి. మద్యపాన నిషేధం కూడా అందులో ఒకటి. ఎన్ని రాష్ట్రాలు దాన్ని అమలుచేస్తున్నాయి? కేవలం మతధర్మాల విషయంలోనే ఎందుకీ ద్వంద్వ వైఖరి..? ఉమ్మడి పౌరస్మృతి', ట్రిపుల్ తలాక్‌లకు సంబంధించిన చర్చ మరోసారి ప్రారంభమైంది.

నిజానికి ఇది కొత్త చర్చేమీ కాదు. చాలా పాతదే. కాకపోతే అప్పుడప్పుడూ కొంతమంది పెద్దలు తమ తమ రాజకీయ ప్రయోజనాల కోసం దీన్ని వాడుకుంటూ ఉంటారు. అయితే ఈ మూడు తలాక్‌లను గురించి అసలు ఇస్లామ్ ధర్మశాస్త్రం (షరియత్) ఏం చెబుతుందో చూద్దాం. ఇస్లామ్ ప్రకారం 'నిఖ' (వివాహం) ఒక పవిత్రమైన బంధం, ఒప్పందం. దాన్ని కాపాడుకుంటూ, కలిసి కాపురం చేయాల్సిన బాధ్యత ఇద్దరిపైనా ఉంటుంది. ఒకవేళ అనివార్యంగా ఏదైనా సమస్య వచ్చినప్పటికి ఇద్దరి మధ్యా విబేధాలు తలిత్తితే, పరస్పర సంప్రదింపుల ద్వారా ఇరుపక్షాల పెద్దమనుషుల ద్వారా పరిష్కరించుకోవాలని ధర్మం చెబుతోంది.

'తలాఖ్, తలాఖ్, తలాఖ్' అని పలికి ముస్లిములు భార్యలను వదిలేస్తున్నారు అన్న దుష్ప్రచారం విపరీతంగా జరుగుతోంది. కానీ సయోధ్య ప్రయత్నాలన్నీ విఫలమై ఇక కలిసి కాపురం చేయడం దుర్లభం అని తేలిపోతే అనివార్యంగా విడాకులకు తీసుకోవం జరుగుతుంది. దీనికోసం షరియత్ నియమనిబంధనలు తెలియజేసింది. అందరూ ప్రచారం చేసే తలాక్ సరైన పద్ధతి కానేకాదు. దీన్ని 'తాలాకె బిద్ అత్' అంటారు. అంటే, ధర్మంలో లేనిదాన్ని ధర్మం పేరుతో ఆచరించడం అన్నమాట. అందుకే ఇలాంటి విధానాన్ని షరియత్ తీవ్రంగా గర్హించింది. అసలు విడాకులనే ఇస్లామ్ అత్యంత అవాంఛనీయ విషయంగా పేర్కొంది.'ధర్మబద్ధమైన వాటిలో దైవానికి ఏమాత్రం ఇష్టం లేనిది విడాకులే' అని మహమ్మద్ ప్రవక్త చెప్పారు. అంటే వివాహ బంధాన్ని కలకాలం కాపాడుకోవాలని, కొనసాగించాలని ఇస్లామ్ అభిలషిస్తుంది. అనివార్య పరిస్థితులోనే, అయిష్టంగా విడాకులకు అనుమతిస్తుంది.. దీన్ని అర్థం చేసుకోకుండా, చొక్కా మార్చినంత సింపుల్‌గా " తలాక్ తలాక్ తలాక్) అని భార్యల్ని మార్చేస్తారన్న అభాండం ఎంతమాత్రం సరికాదు. సయోధ్య ప్రయత్నాలన్నీ విఫలమై, ఇక రాజీకి అవకాశమేలేదని తేలిపోతే అప్పుడు అనివార్యంగానే విడాకులకు పోవాలి. విడాకులు మూడు సార్లు నెలకు ఒకటి చొప్పున ఇస్తారు. ఈ మధ్యలో ఉన్న కాలాన్ని 'ఇద్దత్' (గడువు) అంటారు. ఈ గడువు కాలంలో భార్యాభర్తలు రాజీ పడడానికి ప్రయత్నించాలి. ఇరు పక్షా పెద్దలు సయోధ్య కుదర్చడానికి శక్తివంచన లేని ప్రయత్నం చెయ్యాలి. విడాకుల పత్రం (తలాక్ నామా) రాసుకోవడం ఉత్తమ విధానం. అందులో 'తలాకె రజయీ' (ఒకసారి విడాకు) అని స్పష్టంగా రాయాలి నమ్మకస్తులైన ఇద్దరు వ్యక్తుల సమక్షంలో విడాకులు ఇవ్వాలి.

ఉమ్మడి పౌరస్మృతి గురించి తరచూ మాట్లాడేవారు రాజ్యాంగంలోని 44వ అధికరణను ఉటంకిస్తూ ఉంటారు. నిజానికి భారత రాజ్యాంగంలో ఒక్క 44వ అధికరణ మాత్రమే కాదు ఇంకా అనేకం ఉన్నాయి. అందులో 25వ అధికరణ కూడా ఉందన్న విషయం మనం మరిచిపోకూడదు. భారతదేశంలో వందలాది సంవత్సరాలుగా ముస్లిముల కోసం ప్రత్యేక చట్టం అమల్లో ఉంది. మొగల్ చక్రవర్తుల కాలంలో కూడా ఇస్లామీయ చట్టమే రాజ్యశాసనంగా అమలయ్యేది. అంటే సివిల్, క్రిమినల్ చట్టాలు కూడా! వివాహాలు, విడాకులు, ఆస్తి పాస్తులు, వారసత్వం తదితర విషయాల్లో ముస్లిమేతరులకు వారి వారి మత ధర్మాల ప్రకారం నడుచుకొనే సంపూర్ణ స్వేచ్ఛ, అధికారం ఉండేవి. అంటే, ముస్లిమేతరులకు ప్రత్యేకంగా 'పర్సనల్ లా' ఉండేదన్నమాట. క్రీ॥శ. 1765లో ఈస్టిండియా కంపెనీ భారత న్యాయస్థానాలను పునర్ వ్యవస్థీకరించి, న్యాయవేత్తల సహకారంతో, ఆంగ్ల న్యాయమూర్తులు ఇస్లామియా శాసనాల కనుగుణంగానే తీర్పులిచ్చేవారు. ఆ తరువాత క్రమక్రమంగా ఆంగ్ల చట్టాలను ప్రవేశ పెట్టారు. ఈ విధంగా క్రీ॥శ. 1862 నాటికి ఇస్లామిక్ క్రిమినల్ లాను పూర్తిగా రూపుమాపి, ఆ స్థానంలో ఇండియన్ పీనల్ కోడ్‌ను విధించారు.అది ఈ నాటికీ కొనసాగుతోంది. ఈ విధంగా ఇస్లామిక్ చట్టాన్ని నికాహ్ (వివాహం) తలాఖ్ (విడాకులు) హిబా (దానం) విరాసత్ (వారసత్వం) లాంటి వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాలకు ఇస్లామియా సాంప్రదాయిక చట్టాలు పురుడుపోసుకున్నాయి. ఉదాహరణకు హిందూ సంస్కృతి ప్రభావంవల్ల స్త్రీలకు ఆస్తిలో హక్కును నిరాకరించడం జరిగేది. ఈ కారణంగా ముస్లిం మేధావులు, సామాన్య ముస్లింములు కోరిక మేరకు 1937లో ఆంగ్లపాలకుల కాలంలో ముస్లిం పర్సనల్ లా (muslim personal law shariathapplicatigx act1937) ప్రవేశపెట్టడం జరిగింది. ముస్లిం పర్సనల్ లాలో ఉన్న 'షరియత్ యాక్ట్ 1937' ఏం చెబుతోందంటే, కక్షిదారులు ముస్లిములైన పక్షంలో నికాహ్, మహర్, తలాఖ్, ఖులా, మనోవర్తి, నికాహ్ రద్దు నిర్ణాయక శాసనం (rule of decisigu) షరియత్ చట్టం ప్రకారమే ఉంటుంది. తరువాత క్రీ॥శ. 1939లో వీగిపోయిన ముస్లిం వివాహరద్దు చట్టం (dissolution of muslimmarriages act1939) ని ఒక చట్టాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. అందులో ఇక ముస్లిం మహిళ భర్త నుంచి విడిపోదలిస్తే ఆ మేరకు ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. ఉదాహరణకు, భర్త గనక నాలుగేళ్ళపాటు చెప్పాపెట్టకుండా ఎటైనా వెళిపోవడమో, లేదా వేధింపులకు, దౌర్జన్యానికి పాల్పడడమో, లేదా దీర్ఘకాలిక రోగాలకో, సుఖవ్యాధులకో గురైచ ఉండడమో జగిరితే నికాహ్ రద్దు విషయమై ఆమె కోర్టు నుంచి ఉత్తర్వులు (బి) పొందవచ్చు. పర్సనల్‌లా కేవలం నికాహ్, ఖులా, విరాసత్ లాంటి కొన్ని షరియత్ ఆదేశాలకే పరిమితమై లేదు. దీని పరిధి అంతకన్నా విశాలమైనది, విస్తృతమైనది. కేవలం పెళ్లి పెటాకుల నిబంధనలే కాదు, మొత్తం వారసత్వ వ్యవస్థ అంతా దీని పరిధిలో కొచ్చేస్తుంది. ఈ వ్యవహారాలకు సంబంధించి. ఏ అంశం వివాదాస్పదమైనా న్యాయస్థానం తన తీర్పును షరియత్ చట్టం ప్రకారమే ఇవ్వడానికి నిబద్ధమై ఉంటుంది. ఉదాహరాణకు, ఏ స్త్రీ అయినా భర్త వేధింపులకు విసిగిపోయి విడిపోదలిస్తే అందుకు భర్త అంగీకరించకుండా ఇబ్బందులు పెడుతుంచే ఆమె ధర్మాసనాన్ని ఆశ్రయించి షరియత్ చట్టం ప్రకారం తన వివాహాన్ని రద్దు చేసుకోవచ్చు. లేదా ఇస్లాం నిర్ణయించిన వారసత్వ హక్కును భర్త నిరాకరిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించి తన హక్కును సాధించుకోవచ్చు. ఒక మహిళ తన హక్కును సాధించుకోవడంలో షరియత్ చట్టం ఇతోధికంగా ఆమెకు తోడ్పడుతందే తోప్ప ఏవిధంగానూ అవరోధం కాదు. అయినప్పటికీ ముస్లిం పర్సనల్ లాను మార్చాలని ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావాలని దేశంలో పరివార్ శక్తులు పెద్ద ఉద్యమాన్నే ప్రారంభించాయి. ఇప్పుడు కేంద్రంలో 'తమ' ప్రభుత్వమే కొలువున్న నేపథ్యంలో ఇంకా ఇలాంటి అనేక అస్త్రశస్త్రాలకు అవి పదును పెడుతున్నాయి. సాధ్వినిరంజన్ జ్యోతి, సాక్షి మహారాజ్ వాక్రుచ్చినా, రవిశంకుర్ జ్యోతి మాట్లాడినా, వెంకయ్యా నాయుడు ఉలేఖించినా ఏ రూపంలో ఎవరు ప్రవచించినా ఉద్దేశం మాత్రం ఒకటే. నామమాత్రంగానైనా సరే ముస్లింల ప్రత్యేకతను ప్రతిబింభిస్తున్న ప్రసుత పర్సనల్ లా ను రూపుమాపి, ఆత్మ గౌరవంతో జీవించే హక్కును కాలరాయాలన్నది పరివార్ శక్తుల పన్నాగం. నిజానికి భారత రాజ్యాంగంలోని 25వ అధికరణ చాలా స్పష్టంగా ఇలా చెబుతోంది;“ ప్రజలందరికీ సమానంగా భావ ప్రకటనా స్వాతంత్ర్యం ఉంటుంది. తమకు నచ్చిన మతాన్ని స్వేచ్ఛగా స్వీకరించే, దాన్ని అవలంబించే దాన్ని ప్రచారం చేసుకునే హక్కు వారికి ఉంటుంది.”మత స్వాతంత్ర్యానికి ఉద్దేశించిన ఈ అధికరణప్రకారం, ఏదైనా ఒక వర్గానికి చెందిన మత స్వాతంత్ర్యాన్ని హరించి, తన మత బోధనలకు వ్యతిరేకంగా ఆచరించాలని బలవంత పెట్టే ఎలాంటి 'సివిల్ కోడ్' కూ అవకాశం ఉండకుడదు. ఒక వేళ అలాజరిగితే అది నేరుగా మతంలో ప్రభుత్వ జోక్యం కిందికే వస్తుంది అంటే, 'ప్రజలందరికీ తమ మతధర్మన్ని అవలంబించుకునే పూర్తి సేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయ'న్న రాజ్యాంగంలోని ఇంత ముఖ్యమైన, ప్రధానమైన సూత్రాన్ని విస్మరించి, నిర్దేశిక నియమానికి సంబంధించిన 44ను మాత్రుమే పట్టుకోడం నిజంగానే విడ్డూరం.

– వ్యాసకర్త సయ్యద్ ఆబీద్ హుస్సేన్




# రూ.20,863 కోట్ల రుణం

- ఓపెన్ మార్కెట్ ద్వారా తెచ్చుకునేందుకు కేంద్రం అనుమతి
- ఇప్పటికే రూ.8,104 కోట్లు అప్పు చేసిన టీడీపీ ప్రభుత్వం
- ఈ నెల 25న రూ.2,000 కోట్లు రుణం తీసుకోవాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం
- తెచ్చిన అప్పులను ఉత్పాదక, సంక్షేమ రంగాలకే ఖర్చు చేయాలి
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ





**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ ఏడాది డిసెంబర్ వరకు రాష్ట్ర సర్కారు రూ.20,863 కోట్ల రుణం తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రాష్ట్ర ఆర్థిక శాఖకు లేఖ రాసింది. ఓపెన్ మార్కెట్‌లో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల విక్రయం ద్వారా ప్రతినెలా అవసరానికి అనుగుణంగా కొంతమేర రుణాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ సమీకరిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఓపెన్ మార్కెట్ నుంచి రూ.32,000 కోట్ల రుణం పొందడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా గత టీడీపీ ప్రభుత్వం కేంద్ర ఆర్థిక శాఖను కోరింది. అయితే, కేంద్ర ప్రభుత్వం తొలి త్రైమాసికానికి రూ.8,104 కోట్ల రుణం చేసేందుకు మాత్రమే అనుమతించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ప్రభుత్వం ఏప్రిల్ 5వ తేదీన ఓపెన్ మార్కెట్ ద్వారా ఒకేసారి రూ.5,000 కోట్ల రుణం తీసుకుంది. మే 2వ తేదీన మరో రూ.500 కోట్ల రుణాన్ని తెచ్చింది. ఇలా తెచ్చిన రూ.వేల కోట్ల రుణాలను ఎన్నికల్లో తాయిలాలుగా పంచడానికి, అస్మదీయ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, కమీషన్లు కొల్లగొట్టడానికి తెలుగుదేశం ప్రభుత్వం వాడేసింది.

అంతేకాకుండా మే నెలలో మిగతా మొత్తం రుణాన్ని తీసుకోవడానికి అనుమతించాల్సిందిగా రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ)ను కోరింది. అయితే, ఒకే నెలలో భారీగా రుణం తీసుకునేందుకు అనుమతించబోమని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. నెలకు రూ.2,000 కోట్ల చొప్పున అది కూడా వారానికి రూ.500 కోట్ల మేర రుణం తీసుకునేందుకే అనుమతిస్తామని తేల్చిచెప్పింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ మార్కెట్ ద్వారా మే 6న రూ.500 కోట్లు, మే 10న రూ.1,000 కోట్లు, మే 30న రూ.1,104 కోట్ల రుణాలను తీసుకొచ్చింది. జూన్‌లో కొత్త అప్పులు చేయడానికి వీల్లేకుండా పోయింది. మే 30న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగతా రుణం కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ లేఖ రాసింది. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖ సానుకూలంగా స్పందించింది. ఈ ఏడాది డిసెంబర్ వరకు రూ.20,863 కోట్లు అప్పును ఓపెన్ మార్కెట్ ద్వారా చేసేందుకు అనుమతించింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.28,967 కోట్ల అప్పు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినట్లయ్యింది.

**ప్రజాధనం వృథా చేయొద్దు: సీఎం జగన్**

రాష్ట్ర ప్రభుత్వం తన అవసరాల నిమిత్తం నెలకు రూ.2,000 కోట్ల చొప్పున ప్రభుత్వ సెక్యూరిటీల విక్రయం ద్వారా ఓపెన్ మార్కెట్‌లో అప్పు చేయనుంది. ఇందులో భాగంగా జూన్ 25న రూ.2,000 కోట్ల అప్పు తీసుకురావాలని ఆర్థిక శాఖ నిర్ణయించింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో మూడు శాతం మేర బడ్జెట్ లోపల ప్రభుత్వం అప్పు చేసేందుకు వీలుంది. ప్రభుత్వం తెచ్చిన అప్పులను ఉత్పాదక రంగాలపై వెచ్చిస్తే ఎలాంటి సమస్య ఉండదు. కానీ, గత టీడీపీ సర్కారు అప్పులను అనుత్పాదక రంగాలకు వెచ్చించింది. దుబారాగా ఖర్చు చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆరాటాలు, హంగుల కోసం ప్రజాధనాన్ని వృథా చేయొద్దని, ప్రతి పైసాను పొదుపుగా వాడాలని, తెచ్చిన అప్పులను ఉత్పాదక రంగాలకు, పేదల సంక్షేమానికే ఖర్చు చేయాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు.

## ప్రజావేదికను ఖాళీ చేయిస్తున్న అధికారులు..

**రాజధాని వార్తలు, అమరావతి :** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఉండవల్లి సమీపాన కృష్ణా కరకట్టను ఆనుకుని ఉన్న ప్రజావేదికపై అధికార, తెలుగుదేశం పార్టీల మధ్య రగడ కొనసాగుతోంది. తాజాగా అధికారులు ప్రజావేదికను ఖాళీ చేయిస్తుండడం, చంద్రబాబు వ్యక్తిగత సామాన్లను సిబ్బంది బయట పడేయడంపై తెలుగుదేశం శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నివాస ప్రాంగణం పక్కనే ఉన్న ఈ ప్రజా వేదికను ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా వాడుకునేందుకు తనకు కేటాయించాలని చంద్రబాబు ప్రభుత్వానికి ఇదివరకే లేఖ రాశారు. అయితే చాలా రోజుల్కెనా ఇప్పటి వరకు దీనిపై ప్రభుత్వం స్పందించలేదు. ఈ నేపథ్యంలో నిన్న సాధారణ పరిపాలన శాఖ అధికారులు, సీఆర్‌డీఏ అధికారులు, గుంటూరు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజావేదిక భవనాన్ని పరిశీలించి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. కనీస సమాచారం లేకుండా, తమ నాయకుడి లేఖకు జవాబివ్వకుండా ఇదేం విధానమని తెలుగుదేశం నాయకులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా వేదికను ఖాళీ చేయిస్తుండడం, చంద్రబాబు సామాన్లు బయటపడేస్తుండడంతో మరింత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అవినీతిపై పోరాటానికి సిద్ధం: జగన్

**రాజధాని వార్తలు, అమరావతి:** రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇంజినీరింగ్ పనుల పునఃసమీక్షకు నియమించిన ఉన్నతస్థాయి కమిటీతో తాడేపల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. కమిటీ నియమించిన తర్వాత తొలిసారి భేటీ నిర్వహించిన సీఎం.. ఆ కమిటీ ఎలా పనిచేయాలనే అంశాలపై మార్గనిర్దేశనం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల అంచనాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. జలవనరులతో పాటు, రహదారులు భవనాల శాఖ, మున్సిపల్, సీఆర్డీఏ శాఖలోని కాంట్రాక్టులపై అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. వరద ముప్పు ఉన్న ప్రాజెక్టులపై తొలుత సమీక్షించాలని సూచించారు. పోలవరం పనుల్లో అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా వివరాలతో వచ్చే సమావేశానికి రావాలని తెలిపారు. “ప్రాజెక్టుల్లో అవినీతి జరగడానికి వీల్లేదు. టెండర్ల విధానాన్ని అత్యంత పారదర్శకంగా రూపొందించాలి. వ్యవస్థను బాగుచేసుకోవడానికి తపిస్తున్నాం. కళ్లు మూసుకోండని నాపై ఒత్తిడి తెచ్చారు... అయినా అవినీతిపై పోరాటానికి సిద్ధమయ్యా. ఒక పని రూ.100కు బదులుగా రూ.80కే జరుగుతుంటే రివర్స్ టెండరింగ్‌కు వెళ్దాం. మన ప్రభుత్వం పారదర్శకత దేశానికి ఒక సంకేతం పంపాలి. జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటును కోరాం. రాష్ట్రం తీవ్ర ఆర్థిక నష్టాల్లో ఉంది. అవినీతి వల్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అవినీతిని సహించబోమని పైనుంచి కింది స్థాయి వరకూ గట్టి సంకేతం పోవాలి. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం గందరగోళం చేసింది. స్పిల్‌వే పూర్తి చేయకుండానే కాఫర్ డ్యామ్‌కు వెళ్లారు. కాఫర్ డ్యామ్ కూడా పూర్తి చేయకుండా వదిలేశారు. భారీగా వరద వస్తే నాలుగు నెలల పాటు పనులు చేపట్టలేని పరిస్థితి. గత ప్రభుత్వం నిర్వాకం వల్లే ఈ పరిస్థితి” అని సీఎం వివరించారు. 15 రోజుల్లో నిపుణుల కమిటీతో మరోసారి సమావేశం కావాలని జగన్ నిర్ణయించారు. ఏపీ జలవనరులశాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఆ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, నిపుణుల కమిటీ సభ్యులు, ఇంజినీర్లు సమావేశానికి హాజరయ్యారు.

## సెప్టెంబరు 1 నుంచి సన్నబియ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుకు రూ.3 వేల కోట్లు ఖర్చవుతుందని పౌరసరఫరాల అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

**వలంటీర్లకు రవాణా ఛార్జీలు?**

వలంటీరు తనకు నిర్దేశించిన 50 కుటుంబాలకు సరుకులు తీసుకెళ్లేందుకు వాహనాన్ని ఏర్పాటుచేసుకుంటే రవాణా ఛార్జీలు చెల్లించడంపైనా అధికారులు పరిశీలిస్తున్నారు. సరుకులు లబ్ధిదారులకు అందించేందుకు గడువు నిర్దేశించాలా? లేదా నెల మొత్తం పంపిణీ చేసే వీలు కల్పించాలా? అనే విషయంపై ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

**డీలర్ల వ్యవస్థపై చర్చ**

ప్రజా పంపిణీలో వలంటీర్లను తీసుకువస్తున్నందున ఇప్పటికే ఉన్న డీలర్ల వ్యవస్థ కొనసాగింపుపై చర్చ కొనసాగుతోంది. గోదాముల నుంచి సరుకులు నేరుగా వలంటీర్లు తీసుకెళ్లి లబ్ధిదారులకిస్తారా? లేదా ఇప్పటికే అమల్లో ఉన్నట్టు డీలర్లు సరుకులు తీసుకుని వలంటీర్లకు ఇస్తారా? అనే విషయంపై స్పష్టత లేదు. దీనిపై ఈ నెల 24న జరిగే కలెక్టర్ల సదస్సు అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. డీలర్ల వ్యవస్థను కొనసాగించాలని నిర్ణయించినట్లు మంత్రి కొడాలి నాని తెలిపారు.


**ప్రభుత్వంపై రూ.వేయి కోట్ల భారం**

మంత్రులు కొడాలి నాని, శ్రీరంగనాథరాజు, కన్నబాబు ఆధ్వర్యంలోని మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో పౌరసరఫరాల శాఖపై సమీక్షించింది. ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయకల్లం. సీఎంవో, పౌరసరఫరాల అధికారులు, రైసుమిల్లర్లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి కొడాలి నాని విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులకు సన్నబియ్యం సరఫరాతో ప్రభుత్వంపై రూ.వెయ్యి కోట్ల భారం పడనున్నదని తెలిపారు. రకాలను కూడా భవిష్యత్తులో అందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అంతేకాకుండా రైతుకు గిట్టుబాటు దక్కని పంటకు మద్దతు ధరనిచ్చి కొనుగోలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

**లబ్ధిదారుల ఇంటికే..**

సరుకులను లబ్ధిదారుల ఇంటికి చేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల మంది వలంటీర్లు అవసరమని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. వీరికి ఈ–పోస్ యంత్రాలతోపాటు ట్యాబ్‌లను అందించనుంది. సరుకుల ప్యాకింగ్‌కు అవసరమైన సంచుల తయారీకి ఏటా రూ.360 కోట్లు అవసరమని అంచనా. ప్యాకింగ్ కోసం ప్రత్యేక యంత్రాలను ప్రభుత్వమే కొని వాటిని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 160 ఎంఎల్ఎస్ పాయింట్లకు అందించాలా? లేదా ప్రత్యేకంగా గోదాములు నిర్మించాలా? లేదా ప్రత్యేకంగా గోదాములు నిర్మించాలా? అన్నదానిపై ప్రభుత్వ నిర్ణయం ఆధారంగా ముందుకెళ్లాలని యోచిస్తున్నారు. సరుకులు, సంచులను ప్రభుత్వమే గోదాములకు తరలించి ప్యాకింగ్‌ను మాత్రం ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన కూడా ఉంది. ఈ వ్యవస్థ


## ఎక్స్ అఫీషియో సభ్యులుగా వెల్లంపల్లి, మల్లాది విష్ణు



**రాజధాని వార్తలు, విజయవాడ :** విజయవాడ నగరపాలక సంస్థ ఎక్స్ అఫీషియో సభ్యులుగా దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థకు రావాల్సిన నిధుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నా రోడ్లపై పూడికలు అలాగే వదిలేయడంతో డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. వెంటనే వీఎంసీ అధికారులు డ్రైనేజీ సమస్యపై ద ృష్టి సారించాలని ఆదేశించారు. వచ్చే ఉగాది వరకు ఇళ్ల నిర్మాణం చేపట్టి అర్హులైన వారికి పట్టాలు అందిస్తామని మంత్రి శ్రీనివాస్ వెల్లడించారు.

## జనసేన పార్టీకి మరో షాక్

### జనసేనకు ఆకుల గుడ్‌బై, సొంతగూటికే మళ్లీ...



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు ముగిసినా... టీడీపీ, జనసేనకు చెందిన పలువురు నేతలు కాషాయ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధం అవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒక్కసీటు మాత్రమే సంపాదించుకున్న జనసేన పార్టీకి మరో షాక్ తగలనుంది. ఓటమిపై నేతలు అధైర్యపడవద్దంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినా అవేమీ వారిలో ధైర్యాన్ని నింపడం లేదు. తాజాగా ఆ పార్టీ సీనియర్ నేత ఆకుల సత్యనారాయణ...జనసేనకు గుడ్‌బై చెప్పనున్నారు. తిరిగి ఆయన సొంతగూటికి (బీజేపీ)కి చేరుకోనున్నారు. కాగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజమండ్రి నుంచి జనసేన తరఫున ఎంపీగా బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు.

# రక్తదానం ప్రాణదానం

**ప్రాణాంతక వ్యాధులు.. శస్త్రచికిత్సలు సమయంలో.. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయేది ఎక్కువ శాతం రక్తం లేకపోవడంతోనే.. అలాంటి వారిని కాపాడేందుకున్న ఏకైక మార్గం రక్తదానమే. ఆపద సమయంలో మేమున్నామంటూ బాధితులకు రక్తదానం చేస్తూ అండగా నిలుస్తున్నారు.**



**రాజధాని వార్తలు :** ప్రతి మనిషి తన రక్తం గ్రూపు ఏంటో తెలుసుకోవడం ముఖ్యం ఎవరికి ఏ సమయంలో ఎలాంటి అవసరం వస్తుందో తెలుసుకుని ఆ వివరాల్ని జేబులోని పర్సులో చరవాణిలో నమోదు చేసుకోవడం ఉత్తమం.

- సామాజిక మాధ్యమాల్లో ప్రతిరోజూ ఎక్కడో చూస్తుంటాం ప్రసార మాధ్యమాల్లోనూ రక్తం కావాలని అడిగేవారి సంఖ్య పెరుగుతోంది. బ్లడ్‌బ్యాంక్‌లు ఉన్నా వాటిలో సమృద్ధిగా రక్త నిల్వలు ఉండట్లేదు. దీనికి రక్తదానం చేసేందుకు రాకపోవడమే కారణంగా ఉంది.
- నగర, పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానం అవసరం ఎక్కువగా ఉంటుంది. అవగాహనలేక రక్తదానం చేసేందుకు గతంలో చాలామంది ముందు కొచ్చేవారు కాదు. ఇప్పుడిప్పుడే కుటుంబ సభ్యులు.. బంధువులు, విద్యావంతులు ఎవరైనా రక్తదానం చేసేందుకు ముందుకొస్తున్నారు.
- నవ్యగిరికిలో ప్రతి ఆరు నిమిషాలకు ఒక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంటోంది. విజయవాడ, గుంటూరు నగర ప్రాంతాల పరిధిలో సగటున రోజూ రోడ్డు ప్రమాదంలో పరువులు మృతి చెందుతున్నారు. కొందరు క్షతగాత్రులవుతున్నారు. గాయపడిన వారికి రక్తం ఎంతో అవసరంగా ఉంటుంది.
- కుటుంబ నియంత్రణ.. ప్రసవ శస్త్రచికిత్సలు.. దీర్ఘకాలిక వ్యాధులకు శస్త్రచికిత్సలు , డెంగీలాంటి వ్యాధులకు చికిత్సలు అందించే సమయంలోనూ రక్తం అవసరం ఎంతో కీలకంగా ఉంటుంది.

**ఏది అవసరమో.. అదే..**

గతంలో రోగికి ఇతరులనుంచి సేకరించిన పూర్తి రక్తాన్నిఎక్కించేవాళుఅందుబాటులోకి వచ్చిన ఆధునిక పరిజ్ఞానంతో రక్తం నుంచి ప్లేట్‌లెట్స్.. ప్లాస్మాలు వేరుచేసి ఎవరికి ఏది అవసరమో అదే వినియోగిస్తున్నారు. దీనివల్ల ఒకే రక్తం అనేక మందికి ఉపయోగపడుతుంది. శరీరంలోని అన్ని బాగాలకు ఆక్సిజన్ అందించి ప్రాణాలు నిలిపేది రక్తం ఒక్కటే.

**సేవాసంస్థల కృషి**

అత్యవసర సమయంలో రక్తం అందక ఎవరూ చనిపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థలూ కృషి చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రక్తదానంతో పాటు రక్తనిల్వల కేంద్రాల వివరాలతో ఏపీబ్లడ్ సెల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు.

- కేంద్ర ప్రభుత్వం 112 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా రక్తం అవసరమైన వారికి అందించే చర్యలు తీసుకుంటోంది.
- రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రులు, బోధనా ఆసుపత్రులు, సామాజిక వైద్యపత్రుల్లో రక్త నిల్వల కేంద్రాలు పట్టణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయి.
- సత్తెనపల్లి కేంద్రంగా ఫ్రెడ్స్ సోషల్ ఆర్గనైజేషన్ సంస్త వేలాదిమందికి రక్తదానం చేసింది చేస్తూనే ఉంది. ఫోన్‌చేస్తేచాలు సంస్థ సభ్యులు ఎక్కడికైనా వెళ్లి రక్తదానం చేస్తున్నారు.ఇదే పట్టణంలో ఎడ్యుకేట్ ది సొసైటీ సేవాసంస్థ కూడా ఇలాగే రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.
- నరసరావుపేటకు చెందిన ఫ్రెడ్స్ టూ ఫ్రెడ్స్ సేవా సంస్థ ఆదర్శంగా ఉంది. గుంటూరు, విజయవాడ నగరాలకు చెందిన యువకులు రక్తదానం కోసం ప్రత్యేక గ్రూపులు నిర్వహిస్తున్నారు.

**మూడు నెలలకు ఒక సారి..**

ఆరోగ్యవంతుడు మూడు నెలలకు ఒకసారి ఒక యూనిట్(350 ఎంఎల్) రక్తాన్ని ఇతరులకు దానం చేయవచ్చు. రక్తకణాల జీవితకాలం 120 రోజులు మాత్రమే అని మూడు నెలలకు ఒకసారి చనిపోతూ ఉంటాయి. 350 ఎంఎల్ రక్తం తీసిన తరువాత వెంటనే ప్లాస్మా అనే ద్రవపదార్థం మూడు.. నాలుగు గంటల్లోపే రక్తంలోకి చేరుతుంది. రక్తదానం చేస్తే బలహీనపడతారనేది కేవలం అపోహ మాత్రమే.

- రక్తాన్ని 14 రకాల పరీక్షలు చేసి నిల్వ చేస్తేనే సురక్షితంగా ఉంటుంది. ఏబీ నెగిటివ్, ఓ నెగిటివ్ చాలా అరుదైన రక్త గ్రూపులు.

**హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా దాతలపేర్లను సేకరించి కావాల్సిన వారికి అందించి సహకరిస్తోంది. వీటిలో విజయవాడ (9392710992, 9533545888), గుంటూరు (9299153604), ఏలూరు (9989563961) లలో ఫోను చేసి ఏ ఆస్పత్రికైనా రక్త దాతలను రప్పించుకోవచ్చు, ఇవిగాక విజయవాడలోనే లయన్స్ బ్లడ్ బ్యాంక్, రోటరీ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు (0866 2570082), లయన్స్ డిస్ట్రిక్ట్ 316డి రక్తనిది కేంద్రం (08662573636), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తాలూకా ఆఫీస్, గాంధీనగర్ వంటివి ఉన్నాయి. గుడివాడలో ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలో, మచిలీపట్నంలో డా.పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్-(86722 30605)లలో అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉంటుంది.**

## తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేస్తా..

### ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



**రాజధాని వార్తలు, అమరావతి :** రాజధాని ప్రాంతంలోని తుళ్ళూరు తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలు గత కొన్నేళ్లుగా మగ్గుతున్నాయని బాధితులు నాకు చెప్పారు. గతంలో పనిచేసిన అధికారులు లంచాలకు కక్కుర్తి పడి తమను హింసించినట్టు తెలిపారు. సీఆర్‌డీఏ కార్యాలయాల్లోనూ ఇదే సమస్య నెలకొంది. జగనన్న ప్రభుత్వంలో లంచాలు తీసుకునే వారిపై తప్పకుండా ఉక్కుపాదం మోపుతాం. ఉన్నతాధికారులతో మాట్లాడి తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేస్తాం త్వరలో తహసీల్దార్ కార్యాలయాన్ని నేను కూడా పరిశీలిస్తా.

## అనర్హులకు సీఆర్‌డీఏ నోటీసులు

**రాజధాని వార్తలు,అమరావతి :** రాజధానిలో భూమి లేనటువంటి రైతులు, సామాన్య ప్రజలకు అప్పటి ప్రభుత్వం రూ.2,500 పింఛన్లు కేటాయించింది. ప్రస్తుతం రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో పింఛను తీసుకుంటున్న వారిపై కొత్తగా ఏర్పడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టి సారించి, అనర్హులను పెన్షన్ నుంచి తొలగించే కార్యక్రమాన్ని చేపట్టింది. పెనుమాక గ్రామంలో సీఆర్‌డీఏ అధికారులు స్థానికంగా ఉన్న వీఆర్ఏల చేత రెండురోజుల నుంచి నోటీసులు అందజేస్తున్నారు. వారికి ఎందుకు పెన్షన్ తొలగిస్తున్నారనే అంశం కూడా అందులో పొందుపరుస్తున్నారు. రాజధానిలో 2016 సంవత్సరం మార్చి నుంచి ప్రతి నెలా రూ.2500 పెన్షన్ అందజేస్తున్నారు. భూమి ఉండి పెన్షన్‌లు తీసుకున్న వారు సుమారు ఒక్కొక్కరు ఇప్పటివరకు 39 నెలలకు గాను, రూ.97,500 నగదు తీసుకున్నట్లు ప్రస్తుతం ఉన్న సీఆర్‌డీఏ అధికారులు గుర్తించి, ఆ నగదును రికవరీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.దీంతో పాటు రాజధాని ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములకు దొంగ దస్తావేజులు పుట్టించి, అమ్ముకున్న వారిపై కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. ఏదేమైనా రాజధాని ప్రాంతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జన్మభూమి కమిటీ సభ్యులు చేసిన అక్రమాలు త్వరలోనే వెలుగుచూడనున్నాయని రాజధాని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కన్నబాబు



**రాజధాని వార్తలు, అమరావతి :** వ్యవసాయ శాఖ మంత్రిగా కురసాల కన్నబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రైతు భరోసా పథకం అమలు ఫైల్‌పై తొలి సంతకం చేశారు. రైతులకు పెట్టుబడి ఇచ్చి అండగా నిలవాలని మేనిఫెస్టోలో చెప్పిన మాటను నిజం చేస్తామన్నారు. రైతులను ఆదుకునేందుకు రైతు భీమా పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. 'ధరల స్థిరీకరణ నిధి రూ.3000 కోట్లతో ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నాం. సహకార సొసైటీల ఆధునీకరణ కోసం రూ.120 కోట్లు విడుదల చేస్తున్నాం. నకిలీ విత్తనాలు చలామణి అవుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. తక్షణమే అరికట్టి వ్యాపారులపై తీవ్ర చర్యలు తీసుకుంటాం. మిర్చి, పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వాటిని అరికడతాం. ఒక కంపెనీ కేజీ విత్తనాలు లక్షన్నరకు అమ్ముతోంది. ఆ కంపెనీపై కఠిన చర్యలు తీసుకుంటాం. కౌలు రైతులకు కూడా భీమా, రుణాలు, ఇతర రాయితీలు కల్పిస్తాం. ఇందుకు ప్రత్యేక కార్డులను మంజూరు చేస్తాం. పంటల మీద హక్కులిచ్చేలా చర్యలు తీసుకుంటాం' అని కురసాల కన్నబాబు పేర్కొన్నారు.

## నా తొలి ప్రాధాన్యం క్రీడలకే!: ఏపీ మంత్రి కృష్ణదాస్

### ఆరోగ్యకరమైన సమాజం కోసం క్రీడలను ప్రోత్సహించాలి

**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, ఒలింపిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన ధర్మాన కృష్ణదాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'నేను ముఖ్యమంత్రి అయితే తొలి ప్రాధాన్యం క్రీడలకే' అంటూ వ్యాఖ్యానించారు. శ్రీకాకుళంలో ఆయన ఈరోజు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, తానే కనుక ముఖ్యమంత్రి అయితే తొలి ప్రాధాన్యం క్రీడలకే ఇచ్చేవాడినన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే క్రీడలను ప్రోత్సహించాలని, కానీ గత ప్రభుత్వాలు క్రీడలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ డైనమిక్ నాయకుడు అని, ఆయన హయాంలో క్రీడలకు మంచి రోజులు వస్తాయని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

## గుంటూరు జిల్లా పరిషత్ 'ఎక్స్ అఫీషియో' సభ్యుడిగా నారా లోకేశ్!

### నమోదు చేసుకున్న టీడీపీ నేత



**రాజధాని వార్తలు, గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్సీ నారా లోకేశ్ గుంటూరు జెడ్పీ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నమోదయ్యారు. నారా లోకేశ్ రెండేళ్ల క్రితం ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీలు ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నమోదు చేసుకోవాలి. ఏ నియోజకవర్గంలో అయితే ఎమ్మెల్సీ తమ పేరును నమోదు చేసుకుంటారో, అక్కడ ఆయనకు ప్రోటోకాల్ వర్తింపజేస్తారు. ఈ నేపథ్యంలో నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గం, మున్సిపాలిటీలో తన పేరును ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నమోదు చేసుకున్నారు. దీంతో ఇకపై లోకేశ్ గుంటూరు జిల్లా పరిషత్ లో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కొనసాగుతారు. కాగా, ఈ నెల 23న అంటే రేపు జరిగే జెడ్పీ సర్వసభ్య సమావేశానికి రావాల్సిందిగా నారా లోకేశ్ కు అధికారులు ఆహ్వానం పంపినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

## సాగు.. సాగేనా..?

- నిరాశలో రైతన్న
- చిరుజల్లులు, మబ్బులకే పరిమితం
- జూన్ ముగుస్తున్నా కాలువలకు విడుదల కాని నీరు



**రాజధాని వార్తలు, విజయవాడ :** ఆకాశం మేఘావృతం కావడం, ఈదురుగాలులు వీయడం, చిరుజల్లులు పడడం గత రెండురోజులుగా పరిపాటిగా మారింది. చిరుజల్లులు సామాన్యజనానికి కొద్ది మేర ఊరటనిస్తున్నా వ్యవసాయ సాగుదారులను నిరాశకు గురిచేస్తున్నాయి. జూన్ నెలలో 20 రోజులు గడిచిపోయాయి. ఖరీఫ్ పనులు ప్రారంభిద్దాం అనుకుంటున్న రైతులకు చినుకు జాడలేకపోవడంతో కలత చెందుతున్నారు. జూన్ నెలలోనే కాలువలకు నీటిని విడుదల చేయాలి. ఇంతవరకు నీరు విడుదల కాకపోవడం సాగు ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ మాత్రం పచ్చి రొట్ట విత్తనాలను ఇప్పటికే రైతులకు ఇవ్వగా, వరి విత్తనాలు 1061, బిపిటి రకాలను కేజీ అయిదు రూపాయల సబ్సిడీతో అందించేందుకు సమాయత్తం అవుతున్నారు. సాగుకు అవసరమైన నీరు ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో వరుణుడిపై భారం వేసి పొలం పనులకు శ్రీకారం చుట్టేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. రెవెన్యూశాఖ వారు కౌలు సాగుదారులకు ఎల్‌ఈసి కార్డులను అందించి పంటరుణాలు అందించేందుకు బ్యాంకుసిబ్బందితో చర్చలు జరుపుతున్నారు. రైతులు మాత్రం నీటివనరులు లేకపోవటంతో ఖరీఫ్‌పై ఆశగా ఎదురు చూస్తున్నారు.


# రాజధాని క్లాసిఫైడ్స్

ప్రకటనలకు సంప్రదించండి
**9440662699**

### షాప్స్

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

అరుణోదయ
హెచ్.పి.గ్యాస్ ఏజన్సీ
హుస్సేన్ కట్ట వద్ద,
పాత మంగళగిరి,
9848111905

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

**ఇల్లు అమ్మ కం**
**గుంటూరు నగరంలోని బొంగరాల బీడు ఏరియా లోని స్వాతి పేట, హౌస్ నెంబర్ : 7-6-132, గుంటూరులో.....140 చదరపు గజాల విస్తీర్ణంలోని రెండు రేకుల ఇళ్లు అమ్మ కానికి కలవు. సంప్రదించండి ...99856 58208**

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

రాయపూడి
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ ట్రైలర్స్)
ఫోన్ : 9959308664

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

**సాగర్ బోర్ వెల్స్**
సరసమైన ధరలకు మీరు మేచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీచ్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683, 9652246869

### హోటల్స్

రాయపూడి
కాకతీయ పుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

రాయపూడి
వేణుగోపాల రెడీమేడ్స్ ఫాన్సీ & హోమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర పుడ్స్
రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

### హస్పటల్స్

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
7893187172

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్:0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

**రాజధాని వార్తలు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల పుస్తకం రానుంది. -9440662699**

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

విజయవాడ
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

### యూనివర్సిటీ

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్


## ఆర్‌కామ్ దివాలా ప్రక్రియ షురూ

### ఆర్‌పీగా అనీష్ నానావతి నియామకం



**ముంబై :** రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్).. రిసొల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ)గా డెలాయిటీకి చెందిన అనీష్ నానావతిని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) నియమించింది. ఆర్‌కామ్ సహాదాని అనుబంధ సంస్థలు రిలయన్స్ టెలికాం, రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్.. ఈ నెల 16న ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్‌లో దివాలా పిటిషన్‌ను దాఖలు చేశాయి. రుణదాతలకు రూ.57,382 కోట్ల బకాయిలను చెల్లించటంలో విఫలం కావటంతో ఆర్‌కామ్ తానే సొంతంగా ఈ దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ మొత్తంలో రూ.7,000 కోట్లు గ్రూప్ కంపెనీలకు సంబంధించినవి కాగా మిగిలిన రూ.47,000 కోట్లు 53 బ్యాంకులు నుంచి రుణాలుగా తీసుకుంది. ఇందులో రూ.14,775 కోట్ల రుణాలను చైనాకు చెందిన సంస్థలు అందించాయి.

ఈ మూడు సంస్థలు వ్యాపారపరంగా ఒకదానికొకటి సంబంధాలను కలిగి ఉండటంతో రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌గా అనీష్ నానావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయని రుణదాతల కమిటీ (సీఓసీ).. ట్రిబ్యునల్‌కు తెలిపింది. దీంతో నానావతి నియామకానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా రిసొల్యూషన్ ప్రణాళికకు సంబంధించి ప్రొగ్రెస్ నివేదికను జూలై 23 నాటికల్లా సమర్పించాలని ఆర్‌పీని బెంచ్ ఆదేశించింది. కాగా ఆర్‌కామ్‌పై దోహా బ్యాంక్ దాఖలు చేసిన పిటిషన్‌ను వచ్చే నెల 28న విచారించనున్నట్లు తెలిపింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ రూ.1,400 కోట్ల బకాయిలు చెల్లించటంలో విఫలం కావటంతో ఈ ఏడాది మే 30న దోహా బ్యాంక్... ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. కాగా ఆర్‌కామ్‌కు రుణాలిచ్చిన బ్యాంకుల్లో ఎస్‌బీఐ అగ్రస్థానంలో ఉంది.

ఆర్‌కామ్‌కు ఎస్‌బీఐ రూ.4,905.37 కోట్ల రుణాలను ఇవ్వగా ఎల్‌ఐసీ రూ.4,758 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.2,707.67 కోట్లు, స్టాండర్డ్ అండ్ చార్టర్డ్ బ్యాంక్ రూ.2,130.23 కోట్లు, సిండికేట్ బ్యాంక్ రూ.1,225.19 కోట్లు, పీఎన్‌బీ రూ.1,126.87 కోట్ల రుణాలిచ్చాయి. మరోవైపు చైనా డెవల్‌పమెంట్ బ్యాంక్ రూ.9,863.89 కోట్లు, చైనా ఎగ్జిమ్ బ్యాంక్ రూ.3,356.44 కోట్లు, ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనాకు రూ.1,554 కోట్ల మేర ఆర్‌కామ్ బకాయి పడింది.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం



**రాజధాని వార్తలు, అమరావతి :** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మైన్) రాయపూడి నందు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడమైనది. దీనిలో భాగంగా సామూహిక సూర్యోపాసనం వందన బీజ మంత్ర సహిత సూర్యనామావళితో పాటుగా సూర్యనమస్కార ప్రదర్శన గావించడమైనది.

కొన్ని ప్రత్యేక అసనాలైన శీర్షాసనం, చక్రాసనం, స్టాండింగ్ చక్ర, హలాసనం పద్మాసనం, ధ్యానం, శాంతిపాఠంతో యోగాడే జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దడిగి సుబ్బారావు ఆసనాల ప్రాముఖ్యతను వివరించిరి, కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతిష్ట కోల్పోతున్న పార్లమెంటు

**దేశప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమైన పార్లమెంటు క్రమక్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోతోంది. ఎందరెందరో మహానుభావులు దారిద్ర్య నిర్మూలన, దేశ సమగ్రాభివృద్ధి కోసం తమ గళాలను వినిపించిన ప్రజాస్వామ్య ఆధునిక దేవాలయంలో నేడు వింతపోకడలు చోటు చేసుకున్నాయి. అన్ని వర్గాలను, మతాలను, ప్రాంతాలను ఒక్కటిగా చూడాల్సిన పార్లమెంటులో కులాలు, మతాలకు సంబంధించిన నినాదాలు ఇవ్వడం దేశప్రజలను కలవరపెడుతోంది. తద్వారా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన దేశం ప్రపంచ దేశాల్లో పలుచన అవుతోంది. ఇందుకు కారణం నానాటికి పార్లమెంటులో రాజనీతిజ్ఞుల ప్రాతినిధ్యం తగ్గడమే..**



## 'ఆ వ్యాఖ్యలకు పార్లమెంట్ వేదిక కాదు' : నవనీత్ కౌర్



మహారాష్ట్రలోని అమరావతి లోక్‌సభ స్థానం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికైన నవనీత్ కౌర్ రానా మొదటి సమావేశాల్లోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లోక్‌సభలో కొత్తగా ఎన్నికైన బీజేపీ సభ్యులు పదవీ స్వీకార ప్రమాణం చేసే సమయంలో కొందరు జై శ్రీరామ్ నినాదాలు చేయడంపై ఆమె స్పందిస్తూ.. వాటి కోసం ప్రత్యేకంగా దేవాలయాలు ఉన్నాయి.. ఇక్కడ అలాంటి వ్యాఖ్యలు చేయడం సరైనది కాదు. ప్రజా సమస్యలపై చర్చకు మాత్రమే ఇక్కడ చోటుంది' అని ఆమె స్పష్టం చేశారు.

## జైశ్రీరాం సరైందే : నితీష్ ప్రమాణిక్



ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ అంశంగా మారిపోయిన 'జై శ్రీరాం' నినాదాలు పార్లమెంటులో ఎంపీల ప్రమాణస్వీకార సమయంలోనూ చోటుచేసుకున్నాయి. పశ్చిమబెంగాల్‌లోని అసోంసాల్ నుంచి ఎంపీగా ఎన్నికైన బాబుల్ సుప్రియో ప్రమాణస్వీకారానికి లేచినప్పుడు అధికార పార్టీ సభ్యులు లోక్‌సభలో 'జై శ్రీరాం' నినాదాలు హోరెత్తించారు. లోక్‌సభలో 'జై శ్రీరాం' నినాదాలు చేయడంపై బెంగాల్ కూచ్‌బెహార్ ఎంపీ నితీష్ ప్రమాణిక్‌ను మీడియా ప్రశ్నించినప్పుడు, భారతదేశంలో వివిధ భాషలు, సంస్కృతులకు చెందిన వారంతా కలిసి జీవనం సాగిస్తున్నారని, జైశ్రీరాం నినాదం బెంగాల్‌కే పరిమితం కాదని, దేశం మొత్తానికి చెందిన నినాదమని చెప్పడం ద్వారా పార్లమెంటుస్థాయిని తగ్గించారు. జై శ్రీరాం నినాదాలకు కౌంటర్‌గా మమతా బెనర్జీ 'జై బంగ్లా', 'జై హింద్' నినాదాలు ఇస్తున్నారు కదా అని అడిగినప్పుడు, జై బంగ్లా, జై మహాకాళి, జై మా దుర్గా నినాదాలకు తాము వ్యతిరేకం కాదని అన్నారు.

## ఇంక్విలాబ్ జిందాబాద్ : భగవత్‌మన్



ఆమ్‌ఆద్మీ సభ్యుడు భగత్‌మన్‌కు కూడా ఇదే ప్రహసనం ఎదురైంది. అయితే ఆయన దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. ఇంక్విలాబ్ జిందాబాద్ (విప్లవం వర్ధిల్లాలి) అంటూ దేశం కోసం అసువులు బాసిన భగత్‌సింగ్‌ను దేశ ప్రజలకు గుర్తుతెచ్చారు.

## జైభీమ్.. జైహింద్ ..: ఒవైసీ




మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ప్రమాణం చేయడానికి లోక్‌సభ అధికారులు పిలవగానే బీజేపీ సభ్యులు 'జై శ్రీరామ్', 'భారత్ మాతాకీ జై' అంటూ ఒక్కసారిగా నినాదాలు చేశారు. అసదుద్దీన్ ఒవైసీ ఇబ్బందికి గురయ్యేలా ప్రవర్తించారు. కొంత మంది ఎంపీలు నవ్వుతూ ఆయన్ని హేళన చేశారు. బీజేపీ ఎంపీల నుంచి ఎదురైన ఊహించని పరిణామానికి ఎంఐఎం అధినేత కూడా దీటుగా బదులిచ్చారు. ఇంకా పెద్దగా అరవండి అన్నట్లుగా తన చేతులతో సైగలు చేశారు. స్పీకర్ పోడియం ముందుకు వెళ్లి.. కొంచెం వాళ్లను ఆపండి, ప్రమాణం చేస్తాను అని ప్రొటెం స్పీకర్ వీరేంద్ర కుమార్‌ను కోరారు. బీజేపీ ఎంపీలను హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి వారించారు.

ఎంపీగా ఉర్దూలో ప్రమాణ స్వీకారం చేసిన అసదుద్దీన్.. చివర్లో బీజేపీ ఎంపీల నినాదాలకు ఘాటుగా బదులిచ్చారు. 'జై భీమ్.. జై భీమ్..తక్బీర్ అల్లాహ్ అక్బర్.. జై హింద్' అంటూ నినదించి ప్రమాణ స్వీకారాన్ని ముగించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి..

ఈ వీడియోపై నెటిజన్లు పలు విధాలుగా స్పందిస్తున్నారు. అసదుద్దీన్ ధైర్యాన్ని ప్రశంసిస్తూ కొంత మంది కామెంట్లు పెడుతున్నారు. 'అసదుద్దీన్ ఒవైసీ అంటే బీజేపీ వాళ్లకు భయం.. ఆయన ప్రమాణ స్వీకారం చేయడానికి లేవగానే జై శ్రీరామ్, భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. అందుకు అసద్ బ్రిలియంట్‌గా బదులిచ్చారు' అంటూ ఆదిత్యా మీనన్ అనే నెటిజన్ కామెంట్ చేశారు.

## లౌకికత్వం వర్థిల్లాలి :సుబ్బరాయన్



1952 నుంచి పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షమైన కమ్యూనిస్టులు, 1967 తర్వాత మూడవ శక్తిగా వుంటూ వచ్చిన సీపీఎం, ఇతర వామపక్షాలు ఈ ఎన్నికల్లో ఎన్నడూ లేనంత దిగువకు పడిపోయాయి. 90'లలో కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటును నిర్దేశించి, 2004లోనూ అత్యధికంగా అరవై స్థానాలతో యూపీఏను మూడేళ్లపాటు నిలబెట్టిన వామపక్ష కూటమి ఆరు స్థానాలకే పరిమితమై పోవడం శరాఘాతం. ప్రజాసమస్యలపైన, హక్కులపైన, దేశ సమైక్యత, లౌకికతత్వం కోసం పోరాడే కమ్యూనిస్టుల ఘోరపరాజయం మిగిలినవారినీ కలవరపరుస్తున్న పరిణామం. ఈ పరిస్థితుల్లో తమిళనాడులోని తిర్పూర్‌నుంచి గెలుపొందిన సీపీఐ ఎంపీ కె.స్బురాయన్ లాంగ్‌లివ్ సెక్యూలరిజం (కలకాలం లౌకికత్వం వర్థిల్లాలి), లాంగ్‌లివ్ భారత్ ( భారత్ వర్థిల్లాలి) అంటూ నినదించి, దేశప్రజలను ఆకట్టుకున్నారు.

– ఖాన్

### దాడులను అరికట్టడంలో

## బీజేపీ విఫలం: యూఎస్ రిపోర్టు




**న్యూఢిల్లీ:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేశవ్యాప్తంగా దళితులపై, ముస్లింలపై దాడులు విపరీతంగా పెరిగాయని అమెరికాకు చెందిన ఓ సంస్థ తన నివేదికలో పేర్కొంది. 2019 ఇంటర్‌నేషనల్ రిలీజియన్ ఫ్రీడమ్ రిపోర్టు (అంతర్జాతీయ మతస్వేచ్ఛ నివేదిక) అనే యూఎస్ సంస్థ చేపట్టిన ఓ సర్వేలో పలు అంశాలను వెల్లడించింది. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అభిప్రాయాలను సేకరించిన ఈ సంస్థ.. తన నివేదికలో పలు విషయాలను పొందుపరిచింది. హిందుమత వ్యాప్తి కోసం ఇతర మతాలపై హిందుత్వ సంస్థలు దాడులకు పాల్పడుతున్నాయని పేర్కొంది.

ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి మైనార్టీల మత స్వేఛకు తీవ్ర భంగం ఏర్పడిందని తెలిపింది. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు, అన్ని మతాలకు ఇచ్చిన హక్కులను కాలరాసే విధంగా కొన్ని సంస్థలు వ్యవహరిస్తున్నాయని అభిప్రాయపడింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మైనార్టీలపై దాడులను అరికట్టడంలో తీవ్రంగా విఫలమైందని, మూక దాడుల పేరుతో ఓ వర్గాన్ని తీవ్రంగా హింసిస్తున్నారని నివేదికలో పేర్కొంది. దక్షిణ భారతదేశంతో పోలిస్తే.. ఉత్తరంలో మూకదాడులు విపరీతంగా పెరిగాయని, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో దళితులపై దాడులు ఎక్కువగా ఉన్నాయని ఇంటర్‌నేషనల్ రిలీజియన్ ఫ్రీడమ్ రిపోర్టు తెలిపింది.




దీనితో పాటు అగ్రరాజ్యం అమెరికాకు పలు సూచనలు కూడా చేసింది. అమెరికాతో పోలిస్తే భారత్‌తో మతస్వేచ్ఛను మరింత విస్తరించాలని పేర్కొంది. గత నవంబర్ నుంచి ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 18 ఘటనలు జరగగా.. వీటిలో ఎనిమిది మంది మృతి చెందినట్లు సర్వే రిపోర్టు తెలిపింది. మతస్వేఛపై ప్రచారం కల్పించాల్సిన ప్రభుత్వాలు ఆ విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని వెల్లడించింది. హిందుత్వ సంస్థలు, గోసంరక్షణ దళాలు దళితులు, మైనార్టీలపై దాడులకు మూలకారణం అవుతున్నాయని పేర్కొంది.



# హ్యాపీ హోం



**మనిషి వైట్‌కాలర్ ఉద్యోగం చేసినా,కాయకష్టం చేసినా ఎనిమిది నుంచి 12 గంటలు మాత్రమే అతడు విధులు నిర్వహించగలడు. నిరంతరం ఉద్యోగ కార్యకలాపాల్లో పాల్గొంటే తీవ్రమైన ఒత్తిడికి గురవుతారని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నాణ్యమైన సేవలు పొందాలనుకుంటే ఉద్యోగులకు విశ్రాంతి, కుటుంబ సభ్యులతో గడిపే సమయం తప్పనిసరి. ఉద్యోగం-కుటుంబం రెండింటినీ సమయన్వయం చేసుకుంటే హ్యాపీ హోం సాధ్యమే..**



మూడు దశాబ్దాల క్రిందట ప్రథమ మహిళా ఐపీఎస్ ఆఫీసర్ కిరణ్‌బేడీ ఢిల్లీ ట్రాఫిక్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తూ, పోలీసులకు కూడా వీక్లీ ఆఫ్‌లు అమలు లోకి తీసుకురావాలన్న ప్రతిపాదనను భారత ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చారు. దానిపై చర్చలు జరిగినప్పటికి కార్య రూపం జరగలేదు.

ఈ నేపథ్యంలో తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీలో భాగంగా పోలీసులకు వీక్లీ ఆఫ్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. సుదీర్ఘ కాలంగా చర్చలకే పరిమితమవుతూ వస్తున్న ఈ అంశం, ఎట్టకేలకు అమలు జరుగుతుండడంతో పోలీసులకు కూడా వారానికి ఒకరోజు సెలవు దక్కింది.పోలీసులకు వీక్లీ ఆఫ్ అందించేందుకు ఏపీ ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశం జూన్ 10న నిర్వహించారు. కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా పోలీసులకు వీక్లీ ఆఫ్ అమలు చేసేందుకు మార్గదర్శకాలు సిద్ధం చేయాలంటూ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యనార్ ఆధ్వర్యంలో ఒక కమిటీ నియమించారు. ఏపీ పోలీస్ శాఖలో సుమారు 70వేల మంది సిబ్బంది ఉన్నారు. వారిలో కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకూ ఉన్న వారికి వీక్లీ ఆఫ్ అమలు చేయాలని కమిటీ సూచనలు చేసింది.

దానికి అనుగుణంగా తొలుత విశాఖ, కడప, ప్రకాశం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. సిబ్బంది కేటాయింపులు, సెలవుల మంజూరులో వచ్చిన సమస్యలను పరిశీలించారు. వాటిని పరిగణలోకి తీసుకుంటూ 19 మార్గదర్శకాలు విడుదల చేశారు. వాటి ప్రకారం, ఒక విధానం ఎంపిక చేసుకుని ఆయా జిల్లా, కమిషనరేట్ పరిధిలో వీక్లీ ఆఫ్‌లు అమలు చేయాల్సి ఉంటుంది.స్థానిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న సిబ్బంది సంఖ్యకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఆయా జిల్లాల సూపరింటెండెంట్, కమిషనర్లకు అప్పగించారు.

**మూడు షిఫ్టుల పద్ధతి**

మొత్తం సిబ్బందిని 3 టీములుగా విభజిస్తారు. వీరు మూడు షిఫ్టుల్లో పని చేస్తారు. ఏ టీమ్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పని చేస్తే, బీ టీమ్ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 వరకు పని చేస్తుంది. ఇక సీ టీమ్ రాత్రి 9 నుంచి మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు పని చేస్తుంది.మొదటి షిఫ్టులో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పని చేసిన ఏ టీమ్.. మళ్లీ మరుసటి రోజు రాత్రి 9 గంటల డ్యూటీ చేస్తారు. వీరికి మధ్యలో 32 గంటల విరామం ఉంటుంది. అలా.. బీ టీమ్‌కు 10 గంటలు, సీ టీమ్‌కు 6 గంటల విరామం ఉంటుంది. ఈ విరామ సమయాలు ఒక టీమ్ తర్వాత మరొక టీమ్‌కు మారుతూ ఉంటాయి.

**వీక్లీ ఆఫ్ విధానం**

మొత్తం సిబ్బందిలో ప్రతి 7 మందిలో ఒకరికి చొప్పున ప్రతిరోజూ సెలవు – ఈ విధానం.. జనరల్, ట్రాఫిక్ డ్యూటీలోని కానిస్టేబుల్స్‌కు వర్తింపచేయాలని భావిస్తున్నారు.

**ఆదివారం సెలవు**

కోర్టు కానిస్టేబుల్‌కు ఆదివారం సెలవు ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు.

– బోస్

**తల్లిదండ్రులు ఎంత పెద్ద ఉద్యోగ బాధ్యతలు వహిస్తున్నప్పటికీ పిల్లల ఆలనాపాలనా చూడాలని మనస్సు తహతహ లాడుతుంది. ఇలాంటి సమయంలో ఎప్పుడో పిల్లలు లేవకముందే ఆఫీసుకు చేరుకొని ఆపై వారు నిద్రపోయే సమయాల్లో మళ్లీ ఇంటికి వెళ్లడం తీవ్ర మానసిక క్షోభకు దారి తీస్తుంది. అలా కాకుండా వారి చదువులు ఎలా సాగుతున్నాయి ? పిల్లలకు క్రమశిక్షణ అలవడుతుందా లేదా ? అనేది ప్రతి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ వారికి కావాల్సిన సూచనలు,సలహాలు ఇస్తుంటే ఆ కుంటుంబ వికాసం చెందుతుందనడంలో సందేహం లేదు..వృత్తిలో ఎదురైన సమస్యలను ఎదుర్కొన్న తీరు, చిన్నప్పటి సంగతులు ఇవన్నీ అప్పడప్పడైనా పిల్లలతో పంచుకోగలిగితే కుటుంబ బంధం పెరుగుతుంది. వాస్తవానికి చాలా మంది పోలీసులు ఇవన్నీ చేసే సమయం లేక డబ్బు సంపాదించి వారికి ఇవ్వడమే తమ బాధ్యతగా భావిస్తుంటారు. దీంతో పోలీసు కుటుంబాలే అదుపుతప్పుతున్నాయని చాలా కాలం క్రితం డీఐజీ ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. సమాజానికి పునాది కుటుంబమే .. కుటుంబం బాగుంటే సమాజం పురోభివృద్ధి చెందుతుంది. ఏది ఏమైనా పోలీసులకు సెలవులు అమలు చేయడం ముదావహం.. ఈ సెలవులను వారు సద్వినియోగ చేసుకుంటారని ఆశిద్దాం.**

## సెలవకు మార్గదర్శకాలు

రోజు విడిచి రోజు ఆన్-ఆఫ్ విధానం ఇద్దరు ఉద్యోగులను ఒక జట్టుగా బడ్డీ పెయిర్స్ ఏర్పాటు చేస్తారు. ఒకరు 24 గంటలు డ్యూటీలో ఉంటే మరొకరు 24 గంటలు చేస్తారు. ఎస్‌హెచ్‌వో రోజు మార్చి రోజు 24 గంటలు ఆఫ్ తీసుకోవచ్చు. నెలకు 360 గంటల పాటు డ్యూటీలో ఉన్నా 120 గంటలు అప్రమత్తంగా, 240 గంటలు నామమాత్రంగా ఉండాలి.

**4 రోజుల డ్యూటీ తర్వాత ఆఫ్ తీసుకునే విధానం**

బడ్డీ పెయిర్స్ ఉంటారు. ఇద్దరు కానిస్టేబుళ్లను జత చేస్తారు. కానిస్టేబుళ్లు స్వాపింగ్ పద్దతిలో డ్యూటీ చేసుకోవచ్చు. 4 రోజులు డ్యూటీ తర్వాత సెలవు వస్తుంది. ఒకరు సెలవులో ఉంటే రెండో కానిస్టేబుల్ డ్యూటీలో ఉంటారు.నెలకు 360 గంటల పాటు డ్యూటీలో ఉండాలి. అందులో 120 గంటలు అప్రమత్తంగా, 240 గంటలు నామమాత్రంగా ఉండాలి.

**7 రోజుల ఆన్-ఆఫ్ విధానం**

ఈ విధానంలో ఒకరు పగలు డ్యూటీ వారం చేస్తే మరొకరు రాత్రి డ్యూటీ చేస్తారు. వారం తర్వాత డ్యూటీలు మార్చుకుంటారు.7 రోజుల పాటు విధులు నిర్వహిస్తే ఒక సెలవు వస్తుంది.

**2 షిఫ్టులు 1:1 పద్ధతి**

ముగ్గురు కానిస్టేబుళ్లు ఒక గ్రూపులో ఉంటారు. పగలు, రాత్రి 2 షిఫ్టులు ఉంటాయి. గ్రూపులో ఒకరు పగలు, మరొకరు రాత్రి షిఫ్టులో ఉంటారు. మూడో వ్యక్తి సెలవులో ఉంటారు. అలా 12 గంటల డ్యూటీ తర్వాత 24 గంటల సెలవు వస్తుంది. నెలకు 240 గంటల పని విధానం అమలు చేస్తారు.

**2 షిఫ్టులు 3:1 పద్ధతి**

స్టేషన్లలో సిబ్బందిని ఒక గ్రూపులో 6మంది ఉండేలా విభజిస్తారు. వీరిలో ఉదయం షిఫ్టులో ముగ్గురు, రాత్రి షిఫ్టులో ఒకరు డ్యూటీ చేస్తారు. ఇద్దరు ఉద్యోగులు సెలవులో ఉంటారు. ఆ తర్వాత ప్రతివారం డ్యూటీలు మార్చుకుంటారు.

**2 షిఫ్టులు 4:2 పద్ధతి**

తొమ్మిది మంది సిబ్బందికి సంబంధించి బాధ్యతలు విభజించారు. నలుగురికి ఉదయం, ఇద్దరికి నైట్ షిఫ్ట డ్యూటీలు, మరో ముగ్గురు సెలవులో ఉంటారు. వీరిని 'ఏ,బీ,సీ,డీ,ఈ,ఎఫ్,జీ,హెచ్,ఐ గా విభజించి డ్యూటీలు నిర్ణయిస్తారు. మొత్తం తొమ్మిది రోజుల్లో 3 సెలవులు ఉంటాయి.

**2 షిఫ్టులు 5:1 పద్ధతి**

9 మంది గ్రూపులో 5 మంది పగటి షిఫ్టులో, ఒకరు రాత్రి షిఫ్టులో పని చేస్తారు. ఒకరికి 9 రోజుల్లో 3 సెలవులు ఉంటాయి. నెలకు 240 గంటల విధులు నిర్వహించాలి.

**2 షిఫ్టులు 5:3 పద్ధతి**

12 మంది సిబ్బంది గ్రూపుగా ఉంటే, 5 మంది పగటి డ్యూటీలో, ముగ్గురు రాత్రి విధుల్లో, తక్కినవారు సెలవులో ఉంటారు. మొత్తం 12 రోజుల్లో ఒక ఉద్యోగికి 5 పగటి షిఫ్టులు, 3 రాత్రి షిఫ్టులు, 4 సెలవులు ఉంటాయి.

**2 షిఫ్టులు 7:1 పద్ధతి**

12 మందిని ఒక గ్రూపుగా విభజించి, పగటి డ్యూటీలో 7మంది, రాత్రి డ్యూటీలో ఇద్దరు ఉండేలా చార్ట్ తయారు చేస్తారు. ప్రతి ఉద్యోగికి 7 పగటి డ్యూటీలు, 1 రాత్రి షిఫ్ట్ ఉంటుంది. 12 రోజుల్లో ప్రత ఉద్యోగికి 4 సెలవులు ఉంటాయి.

**2 షిఫ్టులు 9:1 పద్ధతి**

15 మంది సిబ్బంది గ్రూపుగా ఉంటే, మార్నింగ్ షిఫ్టులు ఎక్కువగా, రాత్రి డ్యూటీలు తక్కువగా ఉంటాయి. ప్రతి 15 రోజుల్లో 5 సెలవులు ఉంటాయి. 9 పగటి డ్యూటీలు, 1 రాత్రి డ్యూటీ చేయాల్సి ఉంటుంది.

**రెండు షిఫ్టులు 8:2 పద్ధతి**

ఈ విధానంలో ఒక గ్రూపులో మొత్తం 15 మంది ఉంటారు. వీరిలో 8 మంది పగటి షిఫ్టులో, ఇద్దరు రాత్రి షిఫ్టులో విధులు నిర్వర్తిస్తారు. 15 రోజుల్లో ఒక ఉద్యోగికి 8 డే షిఫ్టులు, 2 రాత్రి షిఫ్టులు, 5 సెలవులు ఉంటాయి.

**రెండు షిఫ్టులు 7:3 పద్ధతి**

ఈ విధానంలో ఒక గ్రూపులో మొత్తం 15 మంది ఉంటారు. రోజులో పగటి షిఫ్టులో 7 మంది పగటి షిఫ్టులో, ముగ్గురు రాత్రి షిఫ్టులో పని చేస్తారు. ఒక ఉద్యోగికి 15 రోజుల్లో ఏడు పగటి షిఫ్టులు, 3 రాత్రి షిఫ్టులు, 5 సెలవులు ఉంటాయి.

**రెండు షిఫ్టులు 6:4 పద్ధతి**

మొత్తం 15 మందిలో డే డ్యూటీలో 6 మంది, నైట్ డ్యూటీలో నలుగురు ఉంటారు. ప్రతి ఉద్యోగికి 15 రోజుల్లో 6 పగలు, 4 రాత్రి డ్యూటీలు, 5 సెలవులు ఉంటాయి.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com